ప్రమాదాలకు నిలయంగా..

కరుణగిరిసెంటర్‌లో రోజుకో ఘటన

- భయాందోళనలో వాహనదారులు
- మితిమీరిన వేగం.. నివారణ చర్యలు శూన్యం

ఖమ్మంరూరల్: కరుణగిరి సెంటర్ అంటేనే ప్రమాదాలకు నిలయంగా మారింది. రూరల్ మండలం పెద్దతండా పరిధిలోని కరుణగిరి సెంటర్‌లో అనునిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. వరంగల్, విజయవాడ, హైదరాబాద్, అటు రాజమండ్రి వైపు వెళ్లే లారీలు, వివిధ రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. దీంతో ఎల్లప్పుడూ వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తుంటాయి. అయితే ఈ వాహనాల వేగాన్ని నియంత్రించడానికి అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో రోజుకు రోజుకు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కనీసం అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం, ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా కరుణగిరి సెంటర్ మారింది. ఈ రోడ్డుకు సమీపంలో ఉన్న టీఎస్‌జీటీస్ కాలనీ, రాజీవ్‌గృహకల్ప, గణేష్‌నగర్, సత్యనారాయణపురం, గ్రామాల నుంచి ఖమ్మంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల బస్సులు విద్యార్థులను తీసుకొని వెళ్తూ వస్తుంటాయి. ఇంకా పలు పనుల నిమిత్తం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఇంత రద్దీ ప్రాంతంలో అధికారులు ముందే జాగ్రత్త పడి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి.

నిత్య ప్రమాదాలు..



స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయని కరుణగిరి సెంటర్

ఇదిలా ఉండగా మితిమీరిన వేగంతో వాహనాలు వెళ్తుండటంతో నిత్యం ప్రమాదాలు జరగడం, పలువురు మృతి చెందడం, క్షతగాత్రులు కావడం నిత్యకృత్యమైంది. పది నెలల క్రితం ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన ఇద్దరు పిల్లలను కళాశాలలో దిగబెట్టడానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో అతని కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి, కూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికీ ఆ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోలుకోక ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇదే ప్రాంతంలో ఓ విద్యార్థి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో ఖమ్మానికి చెందిన పాఠశాలకు చెందిన బస్సు ఓ విద్యార్థిని కరుణగిరి సెంటర్‌లో దింపి వెళ్లగా అతను రోడ్డు దాటుతుండగా లారీ వచ్చి ఢీకొట్టింది. ఇలా చెప్పుకుంటూ పోతే కరుణగిరి సెంటర్‌లో జరిగిన ప్రమాదాలు కోకొల్లలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రమదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం

కరుణగిరి సెంటర్‌లో ప్రమదాలు జరగకుండా ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నాం. ఆ సెంటర్‌లో వాహనాల తనిఖీ చేపట్టడం, మితిమీరిన వేగంతో వెళ్తున్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధిస్తున్నాం. మున్ముందు కూడా ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటాం.

– వెంకటకృష్ణ, ఎస్సై, రూరల్

క్లుప్తంగా

టేకు చెట్ల నరికివేత ఆపాలి

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెం శివారు వాల్యాతండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొన్నేళ్ల క్రితం విద్యార్థులు నాటిన టేకు చెట్లను పలువురు నరికివేయాలని చూస్తున్నారని పూర్వ విద్యార్థులు ఆరోపించారు. ఈ మేరకు చర్యలు చేపట్టాలని ఎంఈఓ శ్యాంసన్‌కు శనివారం విన్నవించారు. సుమారు 25 ఏళ్ల క్రితం అప్పటి గురువులు రామయ్య, మైత్రి ప్రోత్సాహంతో వందకు టేకు చెట్లను నాటగా అవి ఇప్పుడు పెరిగి స్వచ్ఛమైన గాలి, నీడను ఇస్తున్నాయని తెలిపారు. అయితే, చెట్ల ఆకులు రాలుతున్నాయనే సాకుతో వాటిని నరికివేయాలని చూస్తున్న వారికి అడ్డుకట్ట వేయాలని ఎంఈఓను కోరారు.

రోడ్డు మంజూరు చేయాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లి శివారు తండా నుండి మారాలగుడి మీదుగా ఖమ్మం– కోదాడ ప్రధాన రహదారి వరకు రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను హైదరాబాద్‌లో శనివారం సీపీఎం నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ రోడ్డు నిర్మాణంతో రైతుల పొలాలకు రహదారి సౌకర్యం కలుగుతుందని సర్పంచ్ ఎస్.కోటయ్య మంత్రికి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వీరభద్రం, వెంకట్రావు, జే.సంగయ్య తదితరులున్నారు.

ఆసక్తి మేరకు లక్ష్యాలను ఎంచుకోవాలి

కూసుమంచి: విద్యార్థులు తమలోని ఆసక్తి, సామర్థ్యాల మేరకు లక్ష్యాలను ఎంచుకోవాలని ఇండియా లిట్రసీ ప్రాజెక్టు సంస్థ కెరీర్ గైడ్ ఎం.రమేష్ అన్నారు. శనివారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసిన తరువాత ఏయే కోర్సులు తీసుకోవాలి, ఎలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అనే అంశాలపై తగు సూచనలు అందించారు. విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో చదువును కొనసాగించటం వలన అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి వాసుదేవ్, హెచ్‌ఎం రేల విక్రంరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ మైమూనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి

తిరుమలాయపాలెం: ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన రుణమాఫీ హామీని అమలు చేసి రైతుల అప్పులను ఒకే దఫాలో మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బచ్చోడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రైతుబంధు డబ్బులను రైతుల రుణాలను కట్టాలని బ్యాంకర్లు బలవంతం చేసి రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

నగరంలో సినిమాలు

తిరుమల	వాల్తేరు వీరయ్య, ధమాకా
వినోద	వారసుడు
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	తెగింపు
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	వాల్తేరు వీరయ్య

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	66	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	36	చుక్కకూర	2
బీర	50		10
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	50	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	16	మెంతికూర	5
క్యాలీఫ్లవర్	26		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	64		30
క్యారెట్	24	పుదీన	1
క్యాప్సికం	50		20
బీన్స్	46	-ఖమ్మం వ్యవసాయం	

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ ఎత్తివేత



పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఆర్‌టీయూ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: కూసుమంచి మండలం గట్టుసింగారం ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయుడు నల్లమల ప్రభాకర్ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ విధుల్లోకి తీసుకోవాలని డీఈఓ సోమశేఖర శర్మను కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించినట్లు పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షులు మోతుక్కూరి మధు తెలిపారు. శనివారం పీఆర్‌టీయు ఆధ్వర్యంలో కలెక్టర్ గౌతమ్‌ని కలిసిన ప్రభాకర్ అంకితభావంతో పని చేయటంతో పాటు తొలిమెట్టులో కనీస సామర్థ్యాల పెంపునకు కృషి చేశారన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రభాకర్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని విన్నవించగా స్పందించిన కలెక్టర్ సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు తెలిపారన్నారు. తొలుత నూతన కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్ బాధ్యతలు నిర్వహిస్తుండటం పట్ల పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు బాధ్యులు యలమద్ది వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, సాదె వెంకన్న, రెబ్బా శ్రీను, విజయ శేఖర్, మోహన్‌దాస్, సర్వర్‌మియా, రాయల నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్‌ఏలు

కలెక్టర్ వీపీ గౌతమ్‌ను వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నాయకులు చల్లా లింగరాజు, నాగరాజు, రమాదేవి, వెంకట్ విఆర్‌ఏల పలు సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు.

గోశాలకు దాణా వితరణ

ఖమ్మంఅర్బన్: శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యంలో నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెంలోని ఓం శ్రీకృష్ణ గోశాలకు రూ.70 వేల విలువైన దాణాను శనివారం అమవాస పురస్కరించుకోని వితరణగా అందించారు. నగర పెద్దలు, దాల్ మిల్ యజమానులు, గో ప్రేమికులు, సేవా సమితి సభ్యుల ద్వారా సేకరించిన గోదాణాకు సంబంధించిన వస్తువులను సమితి ఆధ్వర్యంలో దానం చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీ నరసింహారావు, కార్యదర్శి పెనుగొండ శ్రీనివాసరావు, సభ్యులు జంగిలి రమణ, సూరినేటి మల్లేశం, సోమారపు సుధీర్ కుమార్, వంగవీటి నవీన్, సుబ్బారావు, పులిపాటి సంపత్ కుమార్, గజ్జి సూర్యనారాయణ, పసుపులేటి రాజేంద్రప్రసాద్, కూసుమంచి రామకృష్ణ, నాగేశ్వరావు, చైన్ సింగ్ రాజపురోహిత్, కేసా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



దాణా వితరణగా అందజేస్తున్న సమితి సభ్యులు

విద్యార్థులకు సాయం

కామేపల్లి (కారేపల్లి): గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో కామేపల్లి మండలంలోని కొత్తలింగాల, గరిడేపల్లి, గోవింద్రాల, బర్లగూడెం, నెమలిపురి తండా గ్రామాల్లోని గవర్నమెంట్ స్కూల్‌లో చదువుతున్న 350 మంది విద్యార్థులకు దుప్పట్లు, గిఫ్ట్ ప్యాకెట్స్, తినుబండారాలు బొమ్మలను పంపిణీ చేశారు. ఎంఈఓ కె. వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు గుడిపూడి శ్రీనివాసరావు, జెట్టి రాంబాబు, దీవెల కోటేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, డి.మాలిక, సంస్థ ప్రతినిధులు మురళి కృష్ణారెడ్డి, సైదులు, సతీష్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన వైఎస్సార్ వీరాభిమాని బండారు నాగేంద్రం మృతిపై వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి పీఏ నంద్యాల రవీందర్‌రెడ్డి శనివారం నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి కొత్త బాలాజీరావు, మండల అధ్యక్షకార్యదర్శులు వాలూరి సత్యనారాయణ, అన్నబత్తుల కృష్ణ నాయకులు బొండ వీరభద్రం, యాకయ్య, ఖాదర్‌బాబా, రాజేష్, వెంకటమ్మ, చుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీతిరపతమ్మ కల్యాణం

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో శనివారం శ్రీ లక్ష్మీతిరపతమ్మ తల్లి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత గ్రామంలో జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పెనుగ్రంచిప్రోలు దేవస్థానం ప్రధాన అర్చకులు రమణ గురుస్వామి, పైనంపల్లి ప్రధాన గురుస్వామి కారంగుల వీరబాబు స్వామి ఆధ్వర్యంలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. నగర సంకీర్తన, దర్శన జ్యోతిని గ్రామంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. డీసీఎంఎస్ డైరెక్టర్, పైనంపల్లి సొసైటీ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దారా ప్రసాద్, ఎస్సై జి.స్రవంతి, సర్పంచ్ కొండ్రు విజయలక్ష్మి, మాలధారణ భక్తులు తరలివచ్చారు.



నగర సంకీర్తన చేస్తున్న మాలధారులు

విజయవంతంగా 'పరీక్ష పే'

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పరీక్ష పే కార్యక్రమం విజయవంతమైంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా బోదులబండలో ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పేయింటింగ్, ఆర్ట్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి బీజేపీ మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు సయ్యద్ మోహినుద్దీన్ మాట్లాడుతూ... ఈ నెల 27న 6 వ విడత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసాని ఉదయ్, చింతలపాటి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన మద్ది

ఖమ్మంరూరల్: తెలంగాణాప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావుఠాక్రేను కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

జిల్లాకు ఏపీ సీపీఎం కార్యదర్శి

ఖమ్మంమయూరిసెంటర్/కొణిజర్ల: సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఖమ్మం వచ్చారు. ఈసందర్భంగా సుందరయ్య భవన్‌లో ఆయనకు పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వామపక్ష ఉద్యమాలకు కేంద్రంగా నిలుస్తూ, , అనేక ఉద్యమాలు నడిపిన చరిత్ర ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రం, మాదినేని రమేష్, నందిపాటి మనోహర్, ఆర్.ప్రకాష్, చింతల రమేష్, కె.అమరావతి, శీలం నర్సింహారావు, కె.గోపి, బివికె మేనేజర్ వై.శ్రీనివాసరావు, కళ్యాణం నాగేశ్వరరావు, గణపతి పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాసరావు కొణిజర్ల మండలం చిన్నగోపతిలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. నాయకులు ఎం.ధర్మానాయక్, భూక్యా వీరభద్రం, తాళ్లపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య, చెరుకుమల్లి కుటుంబరావు, బోయినపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో కాంస్య పతకం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని కవిత డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన వేముల సాహితీ జాతీయ స్థాయి సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని దక్కించుకుంది. 76 కేజీల విభాగంలో సీనియర్ మహిళల చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి పతకం సాధించింది. ఈ మేరక సాహితికి కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్, ప్రిన్సిపాల్స్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి, డాక్టర్ రోజారాణి, పీడీలు సీహెచ్. రాజేష్, విజయ్ సీనియర్ అధ్యాపకులు శ్రీనివాసరావు, శరత్‌బాబులు అభినందనలు తెలిపారు.

ఇరువర్గాల నడుమ ఘర్షణ

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్ల శివారు సంధ్యాతండాలో ఇరువర్గాల నడుమ ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాణోత్ వస్రాం తన పొలంలో పని చేసుకుంటుండగా పక్క చేనులో ఉన్న బాణోత్ కిషోర్ వచ్చి దారి విషయంలో గొడవపడి దాడి చేయడంతో వస్రాం తలకు గాయాలయ్యాయి. అదే విధంగా బాణోత్ వస్రాం, పార్వతి, మంగమ్మలు కోపంతో తిరిగి బాణోత్ కిషోర్‌పై కర్రలతో కొట్టగా తలకు గాయాలయ్యాయి. పరస్పరం ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో అలవాల సత్యనారాయణకు తీవ్రగాయాలైన ఘటన శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బైక్‌పై సత్యనారాయణ ఏదులాపురం వైపు వెళ్తుండగా వరంగల్ వైపు నుంచి ఖమ్మం వస్తున్న బైక్ అతివేగంగా వచ్చి బలంగా ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో చికిత్స నిమిత్తం ఖమ్మం హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 19వ డివిజన్‌లో సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కృషి మేరకు నగర అభివృద్ధి పనులకు సీఎం కేసీఆర్ నిధులను మంజూరు చేస్తున్నారన్నారు. ఆ నిధులతో నగర ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి అందించడం జరుగుతుందన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మేయర్ నీరజ

ప్రపంచ గతిని మార్చిన లెనిన్



మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రపంచ గతిని మార్చిన మహనీయుడు లెనిన్ అని, తన అద్భుతమైన తెలివితేటలు, అంకితభావంతో ఒక నూతన ప్రపంచాన్ని పరిచయం చేశాడని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ... ప్రపంచంలోనే పెట్టుబడి దారి సమాజానికి వ్యతిరేకంగా శ్రామిక జన రాజ్యాన్ని లెనిన్ నిర్మించారన్నారు. స్ఫూర్తిదాయక సోవియట్ విప్లవం ప్రపంచ వ్యాప్తంగా ఒక నూతన చైతన్యాన్ని సృష్టించిందన్నారు. ప్రజలను చైతన్యపర్చడం అందరి కర్తవ్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్కె జానిమియా, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, కొండపర్తి గోవిందరావు, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, రైతు సంఘం అధ్యక్షుడు దొండపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి ఆధారంగా మద్దతు ధర నిర్ణయించాలి

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ ఉత్పత్తులకు పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని వామపక్ష రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుతో ఈనెల 26న ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వామపక్ష రైతు సంఘాల సంయుక్త సమావేశం శనివారం సీపీఐ కార్యాలయంలో జరగగా, నాయకులు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని, రైతు సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం రైతులపై భారం మోపేలా సిద్ధం చేసిన విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల బాధ్యులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, మాదినేని రమేష్, రాంబాబు, మలీదు నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, బానోత్ రాంకోటి, మిడికంటి వెంకటరెడ్డి, తమ్మినేని వెంకటేశ్వర్లు, తాతా వెంకటేశ్వర్లు, ఎస్.కే.మీరాసాహెబ్, ప్రకాష్, కొమ్మినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎమ్మెల్సీ కుటుంబానికి పలువురి పరామర్శ



నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలులో ఎమ్మెల్సీ తాత మధుసూధన్ సోదరుడు విశ్వేశ్వరరావు కుమారుడు నిఖిల్ ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని శనివారం పలువురు పరామర్శించారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు తదితరులు నిఖిల్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీఓ జయరాం పాల్గొన్నారు.

కేసీఆర్, పువ్వాడ చిత్రపటాలకు పాలాభిషేకం

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరుపై రూ.180 కోట్లతో నూతన బ్రిడ్జి మంజూరు చేసినందుకు నగరంలోని కాల్వొడ్డు మున్నేరు బ్రిడ్జి ప్రాంతంలో త్రీటౌన్ మైనార్టీల ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. 47 డివిజన్ కార్పొరేటర్ మాటేటి అరుణ, నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ జిల్లా నాయకులు ఎండి.అన్వర్ ఖాన్, మైనార్టీ 3 టౌన్ కన్వీనర్ షేక్ యాకూబ్ బాబా, యువజన విభాగం 3 టౌన్ ప్రధాన కార్యదర్శి మాటేటి కిరణ్ కుమార్, నాయకులు షేక్ జానీ, మాటేటి రామారావు, మస్తాన్ భాయ్, ఇజార్ భాయ్, యాకుబ్ పాషా, డివిజన్ అధ్యక్షుడు చిన్నం మల్లేశం, బిజిగి సాంబ, సైదులు తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అంబులెన్స్ సిబ్బందికి ప్రశంసలు



ప్రశంసాపత్రాలను అందుకుంటున్న సిబ్బంది

కూసుమంచి: పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి గిఫ్ట్ ఏస్మైల్‌లో భాగంగా సమకూర్చిన 108 అంబులెన్స్ సిబ్బంది పనితీరుకు ప్రశంసలు లభించాయి. అంబులెన్స్ సిబ్బంది నరేష్, లింగయ్యకు 108 హైద్రాబాద్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధికారి ఖలీద్, అనిల్ ప్రకాష్ చేతుల మీదుగా శనివారం ప్రశంసా పత్రాలను అందజేశారు. అంబులెన్స్ మైలేజీ సాధించటంతో పాటు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స సేవలను అందించి కాపాడినందుకు గానూ సిబ్బందికి ఈ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డితో పాటు 108 జిల్లా అధికారులు భూమా నాగేందర్, రాకేష్, సాయికిరణ్ వారిని అభినందించారు.

అగ్రికల్చర్ ఎమ్మెస్సీలో విద్యార్థినికి సీటు

ఖమ్మంరూరల్: మండలంలోని గూడురుపాడుకు చెందిన కొలిచలం స్వర్ణ హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ సీటు సాధించింది. కూలీ పనులు చేసి స్వర్ణ తండ్రి గోపయ్య తన కుమార్తెను కష్టపడి చదివించాడు. సీటు సాధించిన స్వర్ణను పుచ్చకాయల సుధాకర్, కమలాకర్, సిద్ధినేని. కర్ణకుమార్, రామయ్య పలువులు అభినందించారు.

యథేచ్ఛగా జూదం..!

నేలకొండపల్లి: మండలంలో యువత చెడు మార్గాల వైపు దూసుకపోతున్నారు...యథేచ్ఛగా జూదం కోసం పరుగులు తీస్తున్నారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి మండలానికి వస్తున్నారంటే ఇక్కడ పరిస్థితి ఏస్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. మండలం లోని పలు గ్రామాల్లో యువత పేకాట కోసం చేసే పనులను సైతం వదిలి, బానిసగా మారుతున్నారు. జూదరులకు మామిడి తోటలు, గుట్టలు, బండలు, పొలాలు ఇలా ఎక్కడ పడితే అక్కడ వేదికలుగా చేసుకుని పేకాట ఆడేస్తున్నారు. పోలీసుల దృష్టి లో పడకుండా ఒకే చోట ఆడకుండా, వేదికలను మారుస్తున్నట్లు తెలుస్తుంది. ఏపీ నుంచి అప్పలనరసింహాపురం, కట్టుకాసారం, కొంగర తదితర ప్రాంతాల్లో గుట్టల వద్ద జూదం ఎక్కువగా ఆడుతున్నట్లు తెలుస్తుంది. పోలీసులు ఇప్పటికైనా స్పందించి వీరి పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నేలకొండపల్లిలో పేకాట ఆడుతున్న యువత